78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవవందనం చేస్తున్న మంత్రి సవితమ్మ, కలెక్టర్ టిఎస్‌చేతన్, ఎస్పీ వి.రత్న తదితరులు

జిల్లాకు అభివృద్ధి వెలుగులు

జిల్లా అభివృద్ధి సందేశాన్ని విన్పిస్తున్న మంత్రి సవితమ్మ

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ అందించి, శ్రీ సత్యసాయి జిల్లాకు అభివృద్ధి వెలుగులు అందిద్దామనిరాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, హ్యాండ్లూమ్స్, టైక్స్‌టైల్ శాఖ మంత్రి సవితమ్మ పిలుపునిచ్చారు. పుట్టపర్తి పోలీస్ పెరేడ్ మైదానంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్నతో కలిసి మంత్రి జాతీయ పతాకావిష్కరణ చేసి, జాతీయ గీతాలాపన చేశారు. సాయుధ దళాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో చేపట్టి, అమలు చేస్తున్న అభివద్ధి కార్యక్రమాలపై ప్రజలకు మంత్రి తన సందేశం ద్వారా తెలియజేశారు.

- అందరి సహకారంతో అగ్రగామి దిశగా సత్యసాయి జిల్లా
- బిసి సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ
- ఘనంగా 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు
- ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు
- ఉత్తమ అధికారులకు అవార్డులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్
పుట్టపర్తి రూరల్

సమాజంలో అందరూ సమానంగా ఎదిగినప్పుడు, విద్యా, వైద్య సేవలను సంపూర్ణంగా పొంది, పేదరికం నుంచి విముక్తి పొందినప్పుడే నిజమైన స్వాతంత్ర్యం వచ్చినట్లు అని మంత్రి పేర్కొన్నారు. జనరంజక పాలనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అనేక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నారని తెలిపారు. స్వచ్ఛమైన అవినీతి రహిత, వివక్ష లేని పారదర్శక పాలన అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళుతోందని తెలియజేశారు. శ్రీ సత్యసాయి జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంచేందుకు ముఖ్యమంత్రి సారథ్యంలో అనేక అభివద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. పేదరికాన్ని నిర్మూలించడం, అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించడంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు చేపడుతున్నారని వాటిని సత్వరమే అమలు చేస్తున్నట్లు తెలిపారు.

సూపర్-6తో ఆర్థిక పరిపుష్టి

పేదరికాన్ని నిర్మూలించి అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక పరిపుష్టిని కల్పించడంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలు చేపడుతున్నామని చెప్పారు. 5 సంవత్సరాలలో 20 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లేదా నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భతి, తల్లికివందనం, ఏటా రైతుకు రూ.20వేల ఆర్థిక సాయం, ప్రతి ఇంటికి ఉచితంగా సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్లు, ప్రతి మహిళకు నెలకు రూ.1500 ఆర్థిక సహాయం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంను ఈ ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్వచ్ఛ సంకల్పం కింద జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలను స్వచ్ఛ పంచాయితీలుగా మార్చునున్నాట్లు చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా 15-06-2024 నుంచి 13-08-2024 మధ్య 1111 అర్జీలు రాగా వీటిలో 645 అర్జీలకు పరిష్కారం చూపామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి వారిని అభివృద్ధి చేసేలా పాలన సాగిస్తున్నట్లు తెలియజేశారు. ఈ వేడుకల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, అడిషనల్ ఎస్పీ ఎన్.విష్ణు, డిఆర్ఒ కొండయ్య, పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం.శేఖర్, జనసేన పుట్టపర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్తి చంద్రశేఖర్‌తో పాటు అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వేడుకల్లో భాగంగా ప్రదర్శన నిర్వహిస్తున్న చిన్నారులు

తోలుబొమ్మలాట కళాకారుడికి సన్మానం

స్వాతంత్ర సమరయోధుడు, తోలుబొమ్మలాట కళా ప్రదర్శన కళాకారుడు మేళవాయి గోవిందరెడ్డి సన్మానం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులు పుట్టపర్తి ప్రాంతానికి చెందిన చిదంబర రెడ్డి కుటుంబ సభ్యులు రమణారెడ్డి, కదిరి ప్రాంతానికి చెందిన గాజులవారిపల్లి నరసయ్య కుటుంబ సభ్యులు శివరాం ప్రతాప్‌లను మంత్రి ఆత్మీయ సత్కారం చేశారు.

ఆకట్టుకున్న శకటాలు, సాంస్కృతి కార్యక్రమాలు

వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన సేవకులు, అధికారులు, సిబ్బందికి మంత్రి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. జిల్లాలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న 472 మంది అధికారులు, సిబ్బందికి సర్టిఫికెట్లను అందజేశారు. జీవ వైవిధ్యంలో యువత పాత్ర, నషా ముక్తా భారత్ అభియాన్ పై నిర్వహించిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు, కార్పొరేట్ సంస్థల్లో ఉత్తమ పనితీరును కనబరచిన సెక్టార్లకు, స్వచ్ఛంద సంస్థలకు, సాంస్కృతిక బందాలను అభినందించి, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉత్తమ ప్రతిభను చూపిన పోలీసులకు పతకాలను అందించారు.

జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శకటాలు, స్టాళ్లు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయం, ఉద్యానవన బిందు సేద్యం, అటవీ శాఖ చేనేత జౌళి శాఖ, గ్రామీణాభివద్ధి, వెలుగు మహిళా శిశు సంక్షేమం, మెప్మా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో వేడుకల్లో హాజరైన వారందరికీ 20 రకాల మొక్కలను పంపిణీ చేశారు. స్టాళ్లకు సంబంధించి ప్రథమ బహుమతి ఉద్యానవన శాఖ, రెండో బహుమతి పట్టు పరిశ్రమ శాఖ, మూడో బహుమతి స్త్రీ శిశు సంక్షేమ శాఖకు దక్కింది. జిల్లా పోలీసు శాఖ, వ్యవసాయం అనుబంధ శాఖలు, విద్యాశాఖ, విపత్తు అగ్నిమాపక శాఖ, గృహ నిర్మాణ శాఖ, జిల్లా పంచాయతీ శాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఆకర్షణీయంగా ప్రభుత్వ పథకాలపై ప్రజలను చైతన్యవంతం చేసే విధంగా ఏర్పాటు చేసిన శకటాల ప్రదర్శన ప్రజలను ఆకట్టుకున్నాయి. శకటాలలో ప్రథమ బహుమతి జిల్లా పంచాయతీ, ద్వితీయ బహుమతి వ్యవసాయం, మూడవ బహుమతి జిల్లా నీటి యాజమాన్య సంస్థకు దక్కింది.

ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన జిల్లా పంచాయతీరాజ్ శాఖ శకటం

గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

వ్యవసాయ శాఖ స్టాల్‌ను పరిశీలిస్తున్న మంత్రి, కలెక్టర్

తోలుబొమ్మలాట కళాకారుడు మేళవాయి గోవిందరెడ్డిని సత్కరిస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

సిఐటియు ఆధ్వర్యంలో జనజాగరణ

స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటేలా సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి-హిందూపురం

78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సిఐటియు ఆధ్వర్యంలో పట్టణంలోని బిపిల్ షో రూం ఎదురుగా బుధవారం నిర్వహించిన జన జాగరణ సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన వేడుకలు రాత్రి 12 గంటల వరకు కొనసాగాయి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని చాటిచెప్పేలా పాటలు, శాస్త్రీయ, జానపద నృత్యాలు వంటి విభిన్న సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహంగా, వినోదంగా, విజ్ఞానాత్మకంగా నిర్వహించారు. రాత్రి 12 గంటలకు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ స్థానిక జవహర్ లాల్ నెహ్రూ కూడలిలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. దీనికన్నా ముందు సిఐటియు జిల్లా అధ్యక్షులు జడ్పీ శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ నేటి పాలకుల తీరు బ్రిటిష్ వారిని తలపించేలా ఉందని అన్నారు. ఆర్ఎస్ఎస్ ఏం చెప్తే అది జరగాలని, అదే తినాలని, అదే మాట్లాడాలనే విధంగా నేడు దేశంలో బిజెపి పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. కవులను, కళాకారులను, క్రీడాకారులను ప్రోత్సహించడంలో బిజెపి చాలా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. 99 శాతం ఉన్న ప్రజల పక్షాన మాట్లాడకుండా ప్రజల సమస్యలు పరిష్కారం చేయకుండా కేవలం ఒక్క శాతం ఉన్న పారిశ్రామికవేత్తలు పెట్టుబడిదారులు కోసమే పనిచేయడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా అర్థం చేసుకొని ఉద్యోగ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాంబశివ, అంగన్వాడీ జిల్లా కార్యదర్శి శ్రీదేవి, ఉపాధ్యక్షులు ఉషారాణి, హిందూపురం ప్రాజెక్ట్ కార్యదర్శి లావణ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లికార్జున, జగదీష్, ప్రీకాట్ వర్కర్స్ కోశాధికారి నందిస్, ఆటో యూనియన్ కార్యదర్శి రామకృష్ణ, రాము, ఆనంద్, చంద్ర, రామాంజిపాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఈఎస్ వెంకటేష్

టిడిపి గూటికి 'పురం' మున్సిపల్ చైర్‌పర్సన్

అదే బాటలో పలువురు కౌన్సిలర్లు
మున్సిపల్ చైర్మన్‌గా డిఈ రమేష్ కుమార్..?

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం నియోజక వర్గంలో రాజకీయ సమీకరణలు రోజు రోజుకు మారుతున్నాయి. గత నెల చిలమత్తూరు మండలంలో వైసిపి ఎంపిటిసిలు టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. తాజాగా ఎమ్మెల్యే బాలకృష్ణ సమక్షంలో హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు పలువురు వైసిపి కౌన్సిలర్లు టిడిపిలోకి చేరారు. దీంతో హిందూపురం మున్సిపల్ కార్యాలయంపై టిడిపి జెండా ఎగరనుంది. మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న ఇంద్రజను కొనసాగిస్తారా...?, లేదా అదే సామాజిక వర్గానికి చెందిన కౌన్సిలర్ డిఈ రమేష్ కుమార్‌ను కొనసాగిస్తారా...? అన్న దానిపై ప్రస్తుతం రాజకీయవర్గాల్లో చర్చ నడుస్తోంది.

హిందూపురం పురపాలక సంఘంలో 38 కౌన్సిలర్ స్థానాల్లో మున్సిపల్ ఎన్నికల సమయంలో వైసిపి 30 స్థానాల్లో గెలుపొందింది. అప్పటి పురం వైసిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్సీ షేక్ మహమ్మద్ ఇక్బాల్ సారథ్యంలో గెలిచారు. ఇక టిడిపి 6 స్థానాల్లో గెలిచింది. బిజెపి-1, ఎంఐఎం-1 స్థానాల్లో గెలిచారు. అయితే మున్సిపల్ పాలకవర్గం ఏర్పడినప్పటి నుంచి వైసిపిలో విభేదాలు నడుస్తూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్రంలో వైసిపి అధికారం కోల్పోయింది. ఈ నేపథ్యంలో ఆ పార్టీ కౌన్సిలర్లు టిడిపి చేరుతున్నారు. ఇందులో భాగంగానే చైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సమక్షంలో టిడిపిలో చేరారు. సొంత బలం, వైసిపి నుంచి వచ్చిన వారితో కలిసి ప్రస్తుతం 20 మంది కౌన్సిలర్లతో టిడిపికి పూర్తి స్థాయి బలం ఉంది. వీరితో పాటు మరో 14 మంది వైసిపి కౌన్సిలర్లు కూడా టిడిపిలో చేరేందుక సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో నలుగురిని పార్టీలో చేర్చుకోవడానికి టిడిపి నాయకత్వం తిరస్కరించినట్లు తెలుస్తోంది. మరో వైపున పదవి చేపట్టినప్పటి నుంచి పార్టీలో కొన్ని వర్గాల నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న చైర్‌పర్సన్ తన పదవికి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఆమె రాజీనామా చేస్తే, తెదేపా పక్ష నాయకుడు, వాల్మీకి సామాజిక వర్గానికి చెందిన రమేష్ కుమార్‌కు ఛైర్మన్ పదవిని ఇవ్వాలని నాయకులు సమాలోచనలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

చైర్‌పర్సన్‌తో సహా 9 మంది కౌన్సిలర్లు టిడిపిలో చేరిక

హిందూపురం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో సహ నాసీరా బాను, గిరికుమార్, సునీత, పరుశురాం, ఆయూబ్, మల్లికార్జున, షేక్ రేష్మ భాను, నాగమణిలు గురువారం బాలయ్య సమక్షంలో టిడిపికి చేరారు. వీరందరికీ బాలకృష్ణ పార్టీ కండువ కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ మాట్లాడుతూ పట్టణాభివృద్ధి కోసం, మూడుసార్లు హ్యాట్రిక్ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురాన్ని మరింత అభివృద్ధి చేస్తారనే నమ్మకంతోనే టిడిపిలో చేరామన్నారు.

టిడిపిలో చేరిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లతో ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ

చిత్రావతిలో మురుగు చేరకుండా పైపులైన్: ఎమ్మెల్యే

పుట్టపర్తి క్రైమ్ : పట్టణ సమీపంలోని చిత్రావతి నదిలో మురుగు నీరు కలవకుండా ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి తెలిపారు. 9 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టిన ప్రత్యేక పైపులైను పనులు ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై పొంగిపొర్లుతున్నా యని ఆ నీరు చిత్రావతి నదిలో కలుస్తున్నాయన్నారు. స్థానికులు కోరిక మేరకు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్‌కు నిధులు మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మున్సిపల్ మంత్రి నారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. పైపులైను పనులు వెంటనే నాణ్యంగా నిర్మించాలని కమిషనర్ అంజయ్యను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, కౌన్సిలర్ రమణ, మాజీ మున్సిపల్ చైర్మన్ బెస్త చలపతి, రామలక్ష్మణులు, ఉమాపతి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి నూతన బస్సులు ప్రారంభం : పుట్టపర్తి నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి నూతన బస్సు సర్వీసులను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక రవాణా అధికారి మధుసూదన్, మేనేజరు ఇనయాతుల్లా పాల్గొన్నారు.

పైప్‌లైన్ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సింధూర, పల్లె రఘునాథరెడ్డి

ప్రత్యేక పూజలు : పట్టణంలోని చిత్రావతి నది ఒడ్డున నూతనంగా నిర్మించిన గంగాభవానీ ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పాల్గొన్నారు. వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

గోరంట్ల : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని సిరిగవాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దాతలు వెంకటరాముడు, దాసయ్య, లక్ష్మీపతి విద్యార్థుల కు పెన్నులు, నోటు పుస్తకాలు, తదితర విద్యా సామగ్రిని సమకూర్చారు. వాటిని ముఖ్య అతిథి మాజీ ఎంపీటీసీ యువశేఖర్ విద్యార్థులకు పంపిణీ చేశారు. యువశేఖర్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్చాల న్నారు. పాఠశాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత గ్రామస్తులందరిపై ఉందన్నారు. అంతకు ముందు జాతీయ జెండాను ఆవిష్కరించి, విద్యార్థులకు స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమం లో టిడిపి నాయకులు ఆనంద్, ఎస్ఎంసి ఛైర్మన్ మంజుల, మునిస్వామి, మహేష్, ఉపాధ్యాయులు బాలకృష్ణ, ప్రభాకర్ పాల్గొన్నారు

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేస్తున్న యువశేఖర్

ఎమ్మెల్యే రాజు ఔదార్యం

పేదల దాహార్తి తీర్చేందుకు వేతనం విరాళం

ప్రజాశక్తి-మడకశిర

ఎమ్మెల్యే ఎంఎస్.రాజు మరోసారి ఉదారత చాటుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం ఎమ్మెల్యే రాజు మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌మూర్తితో కలిసి పట్టణంలోని ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నగర పంచాయతీలో ప్రతి నిరుపేద ఇంటి వద్దకు తాగునీటి కుళాయి ఏర్పాటు చేసేందుకు తన తొలి వేతనం రూ. 1.75 లక్షలను విరాళంగా అందజేస్తున్నట్లు తెలిపారు. అలాగే భార్య ఉమాదేవి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామితో కలిసి చెక్కును నగర పంచాయతీ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. వారి వెంట కౌన్సిలర్ నరసింహరాజు, బేగార్లపల్లి రవికుమార్, వడ్డే రఘురాం, గుడిబండ మండల కన్వీనర్ మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ మంజునాథ్, భక్తర్ సాబ్ ఉన్నారు.

పాఠశాలకు మైక్ సెట్, ఫ్యాన్లు అందజేత

లేపాక్షి : స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకొని గురువారం మండలంలోని చోళసముద్రం జడ్పీ హైస్కూల్‌కు రమామణి జ్ఞాపకార్థం ఆమె కుమారుడు లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సొంత నిధులతో మైక్ సెట్, ఫ్యాన్లు అందజేశారు. రూ. 40వేల విలువ చేసే మైక్రో ఫోన్ విత్ బ్లూ టూత్ స్పీకర్, రూ. 10వేల విలువ చేసే ఫ్యాన్లను హెచ్ఎం, ఉపాధ్యాయులు సమక్షంలో ఆయన మిత్రమండలి పాఠశాలకు అందజేశారు.

పాఠశాలకు మైక్ సెట్, స్పీకర్ అందజేస్తున్న కరణం రమానందన్ మిత్రమండలి

చిలమత్తూరు మండల పాత్రికేయుల నూతన కార్యవర్గం

జర్నలిస్టుల నూతన కమిటీ ఏర్పాటు

చిలమత్తూరు : మండల విలేకర్ల సంఘం నూతన కమిటిని గురువారం ఎన్నుకున్నారు. నూతన కమిటీకీ అధ్యక్షులుగా ప్రజాశక్తి విలేకరి జి.గంగరాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, గౌరవ అధ్యక్షులుగా పవన్ కుమార్,సహాయ కార్యదర్శులుగా పవన్ కుమార్, షామీర్, రామాంజినేయులును ఎన్నుకున్నారు. అదే విధంగా ఉపాధ్యక్షులుగా విశ్వనాథ్, వనం శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా ఆంజనేయులు, కార్యనిర్వాహణ కార్యదర్శి బాలునాయక్, ఈసీ కమిటి సభ్యులుగా శ్రీధర్ రెడ్డి, రవింద్రరెడ్డి, నాగార్జున, శంకర్, నారాయణ స్వామి, చందు, వెంకటేష్, రుద్రేష్, వేణురెడ్డి, వేణుగోపాల్‌ను ఎన్నుకున్నారు.

కేరళ వరద బాధితుల కోసం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-సోమందేపల్లి

కేరళ వరద బాధితుల కోసం మండలంలోని వ్యవసాయ, కెవిపిఎస్, సిఐటియు, చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్, వాల్మీకి సర్కిల్, ధనలక్ష్మి రోడ్డు, వారపు సంతలో విరాళాలు సేకరించారు. సుమారు రూ. 11,920 వసూలైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, సహాయ కార్యదర్శి గంగాధర్, సభ్యులు నారాయణ, ఆంజనేయులు, కెవిపిఎస్ మండల నాయకులు రామాంజనేయులు, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నాగభూషణ, రవి, చేనేత కార్మిక సంఘం మండల నాయకులు నాగరాజు, షబ్బీర్, తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు, కుటుంబ సభ్యులు

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

జెండా ఆవిష్కరణలో పెనుకొండ సబ్‌కలెక్టర్

జెండా వందనం చేస్తున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు, గుండుమల

హిందూపురం పాంచజన్య పాఠశాలలో ....

ప్రజాశక్తి - పెనుకొండ

ఎందరో త్యాగాధనుల పోరాట ఫలితమే స్వతంత్ర భారతదేశం అని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా గురువారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో మంత్రి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. మంత్రి మాట్లాడుతూ మాతృభూమి బానిస సంకెళ్ల తెంచేందుకు ప్రాణాలర్పించిన త్యాగధనులను స్మరించు కున్నారు. అనంతరం మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో మండల, పట్టణ కన్వీనర్లు సిద్దయ్య, శ్రీరాములు, పట్టణ మహిళా అధ్యక్షురాలు రమణమ్మ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కోర్టు ప్రాంగణంలో సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బుజ్జప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపుల సయ్యద్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వాల్మీకి శ్రీనివాసులు, నాగరాజు, న్యాయవాదులు శర్మ, నాగిరెడ్డి, జావిద్, బాలాజీ, హరీష్, గొల్ల లక్ష్మీనారాయణ, సాయిప్రేమ, ప్రకాష్, సుబ్రమణ్యం కోర్టు సిబ్బంది పాల్గొన్నారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి జెండా వందనం చేశారు. పెనుకొండ డివిజన్ పరిధిలో ప్రతిభ కనబరిచిన అధికారులకు సబ్ కలెక్టర్ ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ ఆళ్ల శ్రీనివాసులు, నగర పంచాయతీ కార్యాలయంలో ఛైర్మన్ ఉమర్ ఫరూక్, రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీధర్, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపీపీ గీతా రామ్మోహన్‌రెడ్డి మువ్వన్నెల జెండాను ఎగురవేశారు. ప్రభుత్వ, ప్రయివేటు విద్యాసంస్థల్లో ప్రిన్సిపళ్లు, హెచ్‌ఎంలు, కరస్పాండెంట్లు త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. గ్లోబల్ జెన్ ప్రగతి ఘనగిరి విద్యాసంస్థల విద్యార్థులు పట్టణ పురవీధుల్లో జాతీయ నాయకుల వేషధారణతో ర్యాలీ నిర్వహించారు. పెనుకొండ ఖిల్లాపై పట్టణంలోని బిటిఆర్ కాలనీ చెందిన యువకులు జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో చంద్ర, బాలునాయక్, బ్రూస్ లీ, నరేష్, బబ్లూ, నబిరసూల్ పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎగరని జెండా

స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు కనిపించలేదు. ఎస్‌టిఒ సుబ్బారెడ్డి, ఎటిఒ లక్ష్మీనారాయణ, తదితర సిబ్బంది కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఎటిఒ లక్ష్మీనారాయణ ఉత్తమ అధికారి అవార్డుకు ఎంపిక కావడంతో పుట్టపర్తి వెళ్లారు.

కదిరి టౌన్ : కదిరిలో 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే వెంకటప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులు మహనీయుల చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పాఠశాలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని చదువు నేర్పిన పాఠశాల రుణం తీర్చుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి చెన్నకృష్ణ, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ హుస్సేన్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం టౌన్ : ధర్మవరం ప్రెస్ క్లబ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 78 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు అసోసియేషన్ అధ్యక్షులు జానపాటి మోహన్ జెండా ఆవిష్కరణ చేపట్టారు. అనంతరం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మురళి గౌడ్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు. గ్రామాల్లో సైతం రైతులు కూలీలు వరి నాళ్లలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జనసేన కార్యాలయం నందు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్ రెడ్డి జెండా ఆవిష్కరణ చేశారు. ధర్మవరంలోని గాంధీనగర్ లో ఉన్న టిడిపి కార్యాలయం వద్ద జరిగిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పాల్గొన్నారు. పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కమతం కాటమయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బీరేగోపాలకృష్ణ , పట్టణ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పరిసే సుధాకర్, పురుషోత్తం గౌడ్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని 25వ వార్డులోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో 25వ వార్డు టీడీపీ ఇన్‌చార్జిభీమనేని ప్రసాద్‌నాయుడు జెండావిష్కరించారు. స్వాతంత్రదినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన 40 మందికి రూ.5వేలు విలువ చేసే విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నాగప్ప, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.అలాగే పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్‌లో పాఠశాల ఫౌండర్ కెట్టిపి రామిరెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కరెస్పాండెంట్ నిర్మలా జయచంద్రరెడ్డి, డైరెక్టర్లు సూర్యప్రకాష్ రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి నివాసం వద్ద గురువారం స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వైసిపి జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, చందమూరి నారాయణరెడ్డి, కోటిరెడ్డి బాలిరెడ్డి, కరీం, ఉడుముల రాము, మేడాపురం వెంకటేష్, రమాదేవి, అమీర్బాష, బైముతక రమణ, కత్తె పెద్దన్న, చౌడప్ప, అజంతా కృష్ణ, దేవరకొండ రమేష్ తదితరులు జెండా ఆవిస్కరణ వేడుకల్లో పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ ఛైర్మన్ జయరామిరెడ్డి, షంషాద్‌బేగం, మున్సిపల్ కమిషనర్ రామ్ కుమార్, వైసిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. నాథన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభా విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : పట్టణంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పట్టణంలోని టిడిపి, వైసిపి కార్యలయాలతో పాటు విద్యా సంస్థలు, ప్రభుత్వ, ప్రయివేటు కార్యలయల వద్ద మువ్వన్నల జెండా రెప రెప లాడింది. మున్సిపల్ కార్యలయంలో ఛైర్‌పర్సన్ ఇంద్రజ, పాంచజన్య పాఠశాలలో అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు అధ్యక్షతన పాఠశాల డైరెక్టర్ స్మీత త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ నంద కుమార్, ఎఓ భాస్కర్, హెచ్‌ఎం గాయిత్రి, సుపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్‌ఎంలు షేక్ అబ్దుల్ రజాక్, సతీష్, శశికళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. సువర్ణ భారతీ జూనియర్ కళాశాల వ్యవస్థపక అద్యక్షులు, ప్రిన్సిపల్ నీలకంఠ రెడ్డి, ఎస్‌డిజిఎస్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు రేవూర్ చంద్ర మోహన్, సెక్రటరీ కరెస్పాండెంట్ బైసాని రాంప్రసాద్, జాయింట్ సెక్రటరీ దాసా గంగాధర్, వైస్ ప్రెసిడెంటు దాసా సురేష్, కోశాధికారి నంద కిషోర్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ నాగేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా జిల్లా ప్రభుత్వ అసుపత్రిలో డాక్టర్ రోహిల్ కుమార్, టిడిపి ఆద్వర్యంలో ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద సమన్వయ కర్త శ్రీనివాస రావు జెండా ఎగర వేశారు. జన విజ్ఞాన వేదిక కార్యదర్శి డాక్టర్ ఈటి రాంమ్మూర్తి నివాసం వద్ద ప్రజా సంఘాల ఆద్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా అదనపు కోర్టు ఆవరణంలో ఎడిజె కంపల్లె శైలజ జెండాను ఆవిష్కరించారు. ప్రెస్‌క్లబ్‌లో అద్యక్షులు రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్, పాత్రికేయులు చంద్ర శేఖర్ శేఖర్ రెడ్డి, షబ్బీర్, ఫణి, క్రిష్టప్ప తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఆద్వర్యంలో నెహ్రూ సర్కిల్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యలయంలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ సేవలను అందించిన అధికారులకు కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి అభినందించారు.

పుట్టపర్తి రూరల్: త్యాగధనుల స్ఫూర్తిని నిత్యం మననం చేసుకుంటూ వారి ఆదర్శాలను పాటించడమే జాతీయతాభావానికి సోపానమని పుట్టపర్తి జూనియర్ సివిల్ జడ్జి కె.రాకేష్ పిలుపునిచ్చారు.. మంగళవారం 78వ స్వాతంత్ర్యవేడుకలను పురస్కరించుకొని కోర్టు ప్రాంగణంలో మువ్వన్నెల జెండాను ఎగురవేసారు. అంతకు మునుపు పోలీసుల నుండి గౌరవ వందనం జడ్జి స్వీకరించారు. పుట్టపర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షులు కత్తి గంగిరెడ్డి అధ్యక్షతన జరిగిన స్వాతంత్ర్య వేడుకలలో న్యాయవాదులు నిడిమామిడి శ్రీనివాసులు రాజేంద్రప్రసాద్ రెడ్డి లెక్కల యదుభూషన్ పూజారి ప్రసాద్ లెక్కల కష్ణప్రసాద్ ఇందిర రాజగోపాల్ చల్లా శేఖర్ సతీష్ రెడ్డి నాగార్జున జానకంపల్లి శ్రీనివాసులు నాగేంద్ర మౌనిక నారాయణ కిరణ్ తో పాటు కోర్టు సిబ్బంది మంజునాథ్, ఎంఎల్ఒ లక్ష్మీ నాయక్ పోలీసులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలానికి చెందిన తహశీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శకుంతల, బిసి హాస్టల్ వార్డెన్ లక్ష్మీనారాయణ, సిడిపిఒ నాగరత్నమ్మ మంత్రి సవితమ్మ చేతుల మీదుగా ఉత్తమ అధికారులుగా అవార్డులు అందుకున్నారు.

గాండ్లపెంట : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో గురువారం ఘనంగా 78వ స్వతంత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిగి : మండల వ్యాప్తంగా 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జెండాను ఆవిష్కరించారు. సీతారాంపురం ఎంపీపీ పాఠశాలలో సీతారాంపురం సవితమ్మ యువ సైన్యం ఆధ్వర్యంలో విద్యార్థులకు పెన్నులు పుస్తకాలు పంపిణీ చేశారు.

బత్తలపల్లి : 78వ స్వాతంత్ర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, పాఠశాలల్లో జెండా ఆవిష్కరించారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు తమ ఇళ్లపైన జాతీయ జెండాలను ఎగురవేసి, జాతీయ సమైఖ్యతను చాటారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అకట్టుకున్నాయి.

కొత్తచెరువు : 78వ స్వాతంత్ర వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో, పాఠశాలల్లో జెండా ఆవిష్కరించారు. విద్యార్థులతో పురవీధుల గుండా దేశ నాయకుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు.

నల్లచెరువు: నల్లచెరువు మదర్సాలో జాతీయ జెండానుకదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మహబూబ్ సాబ్, మాజీ సొసైటీ అధ్యక్షులు అంజనప్ప, మండల కన్వీనర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం : 78వ స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో పాటు మండల పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు. జాతీయ నాయకుల చిత్రపటాలు, జాతీయ జెండాతో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు.

ముదిగుబ్బ : స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయజెండాను గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయాశాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓబులదేవరచెరువు : స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయజెండాను గురువారం ఆవిష్కరించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అలాగే కొండకమర్లలో 78వ స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తలుపుల : స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలలు, కార్యాలయాల్లో జాతీయజెండాను గురువారం ఆవిష్కరించారు.

పెనుకొండ టౌన్ : పట్టణంలోని ఆల్ ఆంధ్ర డ్రైవర్స్ అండ్ క్లీనర్స్ యూనియన్ కార్యాలయం వద్ద యూనియన్ గౌరవాధ్యక్షులు, పెనుకొండ ఎజిపి ఎం.భాస్కర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జాతీయ జెండాని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సభ్యులు, డ్రైవర్లు, క్లీనర్లు పాల్గొన్నారు.

మడకశిర : పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ముందుగా పట్టణంలోని తహశీల్దార్, ఎంజెపి కార్యాలయాలుతోపాటు కళాశాల, శ్రద్ద ఇంటలెక్చువల్ స్కూల్‌లో ఎమ్మెల్యే రాజు జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, ఛైర్మన్ శారద పాల్గొన్నారు.

మడకశిర రూరల్ : మండలంలోని కెజిబివిలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆటల పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కెనరా బ్యాంకు మంజూరు చేసిన స్కాలర్‌షిప్‌ను విద్యార్థులకు అందజేశా రు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆదిరెడ్డిపాలెం, ఉప్పర్లపల్లి ప్రాథమిక పాఠశాలల్లో మువ్వన్నెల జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివన్న, ఎస్‌ఎంసి ఛైర్‌పర్సన్, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని నీలకంఠాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించారు. ఆట పోటీల విజేత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థులు చేసిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. అలాగే పెనుగొండ రోడ్డులో ఉన్న టిడిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు ప్రకాష్, అశ్వత్థమప్ప, ఆదినారాయణ, రాజగోపాల్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్స్ యూనియన్ కార్యాలయంలో యూనియన్ సభ్యులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సభ్యులు మల్లికార్జున, వై.ప్రభాకర్, సుబ్రమణ్యాచారి, రేవన్న, బాషా, నాగరాజు, నరసింహమూర్తి పాల్గొన్నారు

సోమందేపల్లి : మండల వ్యాప్తంగా పంద్రగస్టు వేడుకలు ఘంగా నిర్వహించారు.చల్లాపల్లి ఉన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం శోభారాణి ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహిం చారు. ముఖ్యఅతిథులుగా భాస్కర్‌రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు రామకృష్ణ, సంజీవరెడ్డి పాల్గొన్నారు. భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ పాఠశాలలో పదో తరగతిలో 583 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో సీటు పొందిన షాజియాకు రూ. 10వేలు, మొబైల్ ఫోన్ అందజేశానన్నారు. పదో తరగతి ఫలితాల్లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు వరుసగా రూ. 20 వేలు, రూ. 10 వేలు, రూ. 5 వేలు ఏటా అందజేస్తానని తెలిపారు. అలాగే ప్రతిభ ఉండి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న గ్రామంలోని 8 మంది విద్యార్థులను అనంతపురంలో చదివిస్తున్నానని తెలిపారు.

రొద్దం : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ కార్యాలయాలు, విద్యాసంస్థలు, రాజకీయ పార్టీ కార్యాలయాల పంద్రగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ నాగేంద్ర, ఎస్ఐ వలిబాషా జాతీయ జెండాను ఆవిష్కరించి గౌరవ వందనం చేశారు.

కట్టెలపై జాతీయ జండా ఆవిష్కరణ

మండలంలోని కొన్ని కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరించేందుకు దిమ్మె కూడా లేకపోవడంతో తూతూ మంత్రంగా కట్టెలు ఏర్పాటు చేసి త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. స్థానిక వెలుగు, హౌసింగ్ కార్యాలయాల వద్ద సంబంధిత అధికారులు కట్టెలు ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరించారు.

లేపాక్షి : మండలంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల, శ్రీమార్గదర్శి విద్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. పుర వీధుల్లో విద్యార్థుల జాతీయ నాయకుల వేషధారణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటరత్నమ్మ, తహశీల్దార్ సౌజన్య లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ ఈరన్న, రెవెన్యూ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రజతకుమారి, పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రామాంజనేయులు, విద్యుత్ సబ్ స్టేషన్‌లో సిద్దేశ్వర, టిడిపి కార్యాలయంలో మండల కన్వీనర్ గణేష్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో మంజునాథ్, సొసైటీలో మాజీ జెడ్పిటిసి నరసింహమూర్తి, జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం రఘు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ భార్గవ్ జాతీయ జెండను ఆవిష్కరించారు. కార్యాక్రమంలో ఎంపీడీవో భాస్కర్, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు మంజునాథ్, గురుమూర్తి, ఆర్ఐ గిరియప్ప, హెడ్ కానిస్టేబుల్ మధు, వీఆర్వోలు, నాయకులు జయకుమార్, రఘు, తిప్పేస్వామి, మంజునాథ్ పాల్గొన్నారు. విద్యార్థులు పట్టణంలో జాతీయ నాయకుల చిత్రపటాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ ఆవరణలో శ్రీసాయి విద్యానికేతన్, వాసవీ పాఠశాలల విద్యార్థులు చేసిన నృత్యాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.

గుడిబండ : స్థానిక వర్షా సైనిక్ పాఠశాలలో నిర్వహించిన పంద్రాగస్టు వేడుకలకు ముఖ్య అతిథిగా ఎస్ఐ ముని ప్రతాప్ హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. విద్యార్థులు ప్రదర్శించిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వర్ష స్కూల్ కస్పాండెంట్ శ్రీనివాసులు, షబ్బీర్, సైపుల్లా, శివకుమార్, శ్రీరామప్ప, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయం ఆవరణలో గ్రంథాలయ శాఖ అధికారి కమలనాభరావు ఆధ్వర్యంలో రిటైర్డ్ హెచ్‌ఎం బండప్ప జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధర్మవరంలో జెండా ఆవిష్కరిస్తున్న పరిటాల శ్రీరామ్

జెండా ఆవిష్కరిస్తున్న ధర్మవరంలో 25వ వార్డు ఇన్‌ఛార్జి

నీలకంఠాపురంలో సిడబ్ల్యుసి మెంబర్ రఘువీరారెడ్డి జెండా వందనం

పలువురికి ఉత్తమ అధికారులుగా అవార్డులు

అవార్డు అందుకుంటున్న పెనుకొండ సబ్‌కలెక్టర్

అవార్డు అందుకుంటున్న సోమందేపల్లి గ్రంథాలయ అధికారి

ప్రజాశక్తి-పెనుకొండ

జిల్లా వ్యాప్తంగా ఉత్తమ సేవలు అందించిన ప్రభుత్వ ఉద్యోగులకు గురువారం పుట్టపర్తిలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఉత్తమ ఉద్యోగుల అవార్డు, ప్రశంసాపత్రం అందజేశారు. వారిలో 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో పెనుకొండ డివిజన్ పరిధిలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు చేపట్టిన సబ్ కలెక్టర్ అపూర్వభరత్ మంత్రి సవిత నుంచి ఉత్తమ అధికారిగా అవార్డు, ప్రశంసా పత్రం అందుకున్నారు. అలాగే నగర పంచాయతీ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ్, మండల సర్వేయర్ కోదండపాణి, డిప్యూటీ తహశీల్దార్ గిరి మంత్రి నుంచి ఉత్తమ అధికారులుగా ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

సోమందేపల్లి : ఎంఇఒ ఆంజనేయులు నాయక్, మండల విద్యుత్ శాఖ అధికారి సంజీవప్ప, గ్రంథాలయ అధికారి మెహబూబ్‌బాషా, విద్యాశాఖ కార్యాలయ కంప్యూటర్ ఆపరేటర్ ఎస్. రాజశేఖర్‌రెడ్డి, పందిపర్తి సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ బాలాజీ, తుంగోడు సచివాలయ మహిళా పోలీస్ నందిని పుట్టపర్తిలో మంత్రి సవిత, జిల్లా కలెక్టర్ టిఎస్.చేతన్ నుంచి ఉత్తమ సేవా అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు.

రొద్దం : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ నాగేంద్ర, డిటి ఖలీల్‌బాషా, సీనియర్ అసిస్టెంట్, వీఆర్వో రామ్మోహన్, గ్రంథాలయ అధికారి నాగరాజు ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. వీరు పుట్టపర్తిలో పెనుగొండ సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ నుంచి అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఈ అవార్డుతో తమపై బాధ్యత మరింత పెరిగిందని వారు తెలిపారు.

గుడిబండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ రాంభూపాల్ రెడ్డి పెనుకొండలో సబ్ కలెక్టర్ అపూర్వ భరత్ నుంచి అవార్డు అందుకున్నారు. ఈయన చాలాకాలంగా గుడిబండ రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐగా పని చేస్తూ ఉద్యోగోన్నతిపై డిప్యూటీ తహశీల్దార్‌గా నియమితులయ్యారు.

గోరంట్ల : మండలంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న రజిత ఉత్తమ ఉద్యోగి అవార్డుకు ఎంపికైంది. ఆమె గురువారం పుట్టపర్తిలో జరిగిన పంద్రాగస్టు వేడుకల్లో కలెక్టర్ చేతన్, మంత్రి సవిత నుంచి ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు. అవార్డు గ్రహీత రజిత మాట్లాడుతూ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు.

గుడిబండ : స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంపిహెచ్‌ఒగా పని చేస్తున్న ఖాదర్‌వలి పెనుకొండలో మంత్రి సవిత నుంచి ఉత్తమ అవార్డు అందుకున్నారు. ఈయనకు గుడిబండ, రొళ్ల పిహెచ్‌సిల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కొత్తచెరువు : కొత్తచెరువు గ్రంథాలయంలో పనిచేస్తున్న గ్రంథాలయ అధికారి జయరాం ఉత్తమ అధికారిగా అవార్డు అందుకున్నారు. పుట్టపర్తి పోలీస్ పెరేడ్ గ్రౌండ్లో లో జరిగిన 78వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో మంత్రి సవిత, కలెక్టర్ చేతన్ చేతుల మీదుగా జయరాం ఉత్తమ గ్రంథాలయ అధికారి అవార్డు అందుకున్నారు.

బత్తలపల్లి : మండలంలో విధులు నిర్వహిస్తున్న పలు శాఖల అధికారులకు ప్రభుత్వం నుంచి అవార్డులు రావడంతో వారికి పలువురు అధికారులు, నాయకులు అభినందనలు తెలిపారు. సిఎస్‌ఒటి శారద, ఆర్‌డబ్ల్యూఎస్ మండల ఇంజనీర్ వరలక్ష్మి, ఎమ్మార్సీ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ చంద్ర ఉత్తమ ఉద్యోగులుగా అవార్డులు అందుకున్నారు. అవార్డులు అందుకున్న వారిని ఎంపీపీ బగ్గిరి త్రివేణి. జెడ్పీటీసీ కోటీ సుధ, వైసిపి మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ మండల కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, జనసేన మండల కన్వీనర్ పురంశెట్టి రవితో పాటు పలువురు అధికారులు, నాయకులు అభినందించారు.

పుట్టపర్తి రూరల్ : 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు మంత్రి సవితమ్మ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్పీ కార్యాలయంలో స్పెషల్ బ్రాంచ్ లో విధులు నిర్వహిస్తున్న రెడ్డప్ప రెడ్డి మదనమోహన్ రెడ్డిల సేవలు గుర్తించి వారికి ఉత్తమ అధికారులుగా అవార్డు ప్రధానం చేశారు.

అవార్డు అందుకుంటున్న గోరంట్ల ఐసిడిఎస్ సూపర్‌వైజర్

అవార్డు అందుకుంటున్న కొత్తచెరువు గ్రంథాలయ అధికారి

నేరాలు ఘోరాలు

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణం నానా దర్గా సమీపంలో బాకీ డబ్బులు ఇచ్చే విషయములో ఈ నెల 13న జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని రాయచోటి రోడ్ రైల్వే ట్రాక్ సమీపములో నిందితుడు షేక్ రఫ ని అరెస్టు చేసి హత్యాయత్నం కు ఉపయోగించిన ఒక చెక్క మొద్దును అతని వద్ద నుండి స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టు ఆదేశాల మేరకు 15 రోజులు రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు

ప్రజాశక్తి - బత్తలపల్లి

మండలంలోని చిత్రావతి నది, ఇతర ప్రాంతాల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే అలాంటి వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని బత్తలపల్లి ఎస్ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. గురువారం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లపైన కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్రావతి నది నుంచి ఇసుకను అక్రమంగా తరలించి రామాపురం వద్ద డంప్ చేసి అక్కడ నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. దీంతో సిబ్బందితో కలసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్కడున్న ఐదు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు వివరించారు. ఇసుకను అక్రమంగా ఎవరు తరలించినా కఠినంగా వ్యవహరిస్తామన్నారు.

ఇంటిపైకప్పు కూలి ఇద్దరికి గాయాలు

పెనుకొండ : మండలంలోని మరువపల్లి గ్రామంలో బుధవారం రాత్రి మిద్దె ముందు భాగం కూలి ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. బాధితులు తెలిపిన వివరాలు.. మరువపల్లి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మి, వడ్డే వెంకటేశప్ప దంపతులు బుధవారం రాత్రి తమ ఇంటి ముందు భాగంలో నిద్రించారు. అర్ధరాత్రి మిద్దె ముందు భాగం పైకప్పు ఉన్నఫళంగా కూలి వారిపై పడింది. చుట్టుపక్కల వారు గమనించి శిథిలాల నుంచి వారిని బయటకు తీసి పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు.

వైసిపి నాయకుడి మృతికి మాజీ ఎమ్మెల్యే నివాళి

చెన్నేకొత్తపల్లి : మాజీ జడ్పీటీసీ పుల్లారెడ్డి ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పులేటిపల్లి గ్రామం వెళ్లి పుల్లారెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

సోమందేపల్లి : మండలంలోని వెలగమాకులపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం హెచ్ఎం రేష్మ ఆధ్వర్యంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మాజీ ఎంపిటిసి నరసింహులు, ఎస్ఎంసి ఛైర్మన్ టి.రామాంజి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధే మా లక్ష్యమన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం కోసం పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్ అందజేశామని తెలిపారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

ధర్మవరం టౌన్ : కార్పొరేట్ సంపదను పున్న పంపిణీ చేయాలని, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్న డిమాండ్‌తో విశాఖపట్నంలో సెప్టెంబరు 1,2,3 తేదీలలో జరుగు ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనానికి సంబంధించిన పోస్టర్లను ఆసంఘం నాయకులు గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సిపిఐ నియోజకవర్గకార్యదర్శి ముసుగు మధు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి రమణ, విద్యుత్ మీటర్ రీడింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కిరణ్, కోశాధికారి దస్తగిరి, పాల్గొన్నారు.

విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ అందజేత

గుడిబండ : మండలంలోని కెఎన్.పల్లి జడ్పీ హైస్కూల్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ బాలికలకు విద్యా జ్యోతి పథకం కింద మెరిట్ స్కాలర్‌షిప్ పంపిణీ చేసినట్లు స్థానిక కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య తెలిపారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు సురేష్, హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం, బ్యాంక్ సిబ్బంది, పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం వితరణ

గుడిబండ : 2005-06 విద్య సంవత్సరంలో స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చదివిన విద్యార్థులు గురువారం పాఠశాలకు రూ. 50 వేల విలువ చేసే అహూజా సౌండ్ సిస్టమ్ అందజేసినట్లు పాఠశాల పూర్వ విద్యార్థులు ఉమేష్, అంజమ్మ, తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం గోవిందప్ప, స్థానిక నాయకులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం, డిప్యూటీ సిఎం ఫోటోలు అందజేత

అమరాపురం : మండలంలోని హలుకూరు ఏపి మోడల్ స్కూల్, కాలేజీలో ప్రిన్సిపల్ ఓబుళపతి ఆధ్వర్యంలో ఎస్ఎంసి ఛైర్‌పర్సన్ రాధమ్మ గోవిందప్ప జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలను కళాశాలకు అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ గణేష్, తెలుగు యువత ఉపాధ్యక్షులు రఘు. మంజునాథ్, తిప్పేస్వామి, హనుమంతరాయ, కృష్ణప్ప, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల కోసమే ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లు : మంత్రి

ప్రజాశక్తి-పెనుకొండ

నిరుపేదకు పట్టెడన్నం పెట్టిన నాడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం అని, పేద ప్రజల కోసమే ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లను సిఎం చంద్రబాబు పునఃప్రారంభించారని బిసి సంక్షేమ, చేనేత జౌళి శాఖల మంత్రి సవిత తెలిపారు. పట్టణంలో మంత్రి నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌లో మంత్రి పేదలకు భోజనం వడ్డించి మాట్లాడారు. పేద ప్రజల కడుపు నింపాలనే గొప్ప సంకల్పంతో ఆనాడు చంద్రబాబు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్లు పెడితే పేద ప్రజల ద్రోహి జగన్ ముఖ్యమంత్రి కాగానే వాటిని మూత వేశారని మండి పడ్డారు. ప్రజలకు కడుపు నిండా అన్నం పెడితే ఎందుకంత కడుపు మంట జగన్ రెడ్డి అని ప్రశ్నించారు. ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్న క్యాంటీన్లు పునఃప్రారంభమవుతాయని, పేదలు కడుపునిండా నాణ్యమైన భోజనం తినవచ్చునని తెలిపారు. పెనుకొండలో నిరుపేదలకు ఎన్టీఆర్ అన్న క్యాంటీన్ ద్వారా 429వ రోజులుగా నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, వెంకటరమణ, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు భోజనం వడ్డిస్తున్న మంత్రి సవిత

గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే పల్లె సింధూర అన్నారు. గురువారం పుట్టపర్తి ఆర్ డి ఓ కార్యాలయం ఎదురుగా నియోజకవర్గంలోని 11 పంచాయతీలకు స్వచ్ఛభారత్ ట్రాక్టర్లను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి చేతుల మీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు మాజీమంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, డిపిఒ విజయ్ కుమార్ ,జడ్పీ డిప్యూటీ సిఇఒ లలితా బాయి, డిఎల్‌పిఒ శివకుమారి గ్రామ సచివాలయ మోడల్ అధికారి శివారెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పల్లె సింధురారెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీలే దేశ ప్రగతికి పట్టుకొమ్మలని అన్నారు. పారిశుధ్యం విషయంలో గ్రామ కార్యదర్శులు నిర్లక్ష్యం ప్రదర్శించ వద్దని హెచ్చరించారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ అభ్యున్నతికి పంచాయతీ అధికారులు ప్రధాన పాత్ర పోషించాలని కోరారు. కార్యక్రమంలో జన సేన ఉమ్మడి జిల్లాల ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, బిజెపి నాయకులు లాయర్ హరికృష్ణ , రామాంజనేయులు ,జ్యోతి ప్రసాద్, సూర్యనారాయణ, నారాయణ, ధృతేజ , టిడిపి నాయకులు రామాంజనేయులు, శ్రీరామ్ రెడ్డి, గంగాధర్ నాయుడు, సురేష్‌కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ భారత్ ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-పెనుకొండ

2023-24లో పదో తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన పెనుకొండ, రొద్దం, సోమందే పల్లి, గోరంట్ల మండలాల విద్యార్థులకు బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. పట్టణంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో గురువారం హైకోర్టు న్యాయవాది శివ రామకృష్ణ ఆధ్వర్యంలో రొద్దం మండలం నుంచి చాకలి దర్శన్ (585), మునిమడుగుకి చెందిన నరేష్(568), కె.అక్షయ(555), ఎపి ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ విద్యార్థి త్రిష(550), మౌనిక (535), రేణుక (512), నిహారిక(501), చల్లాపల్లి జయంతి(545), గోరంట్ల గీతాంజలి(537)ని ప్రతిభా పురస్కారం, మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. వారి తల్లిదండ్రులను సైతం సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సరోజమ్మ, టీచర్లు గుణవతి, శ్వేత, నిహారిక, బహుజన చైతన్య వేదిక గౌరవాధ్యక్షులు వెంకటేశు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, ఉపాధ్యక్షులు నాగరాజు, ఈశ్వర్, గౌరవ సలహాదారులు నరసింహులు, రామాంజనేయులు, సభ్యులు హనుమంతు, ధన, చిన్నఅంజనప్ప, బెల్దారి అంజనప్ప, అడదాకులపల్లి నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలు అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులతో బహుజన చైతన్య వేదిక సభ్యులు

ఎపిఆర్ఎస్ పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు

పరిగి : ఉత్తమ సేవలు అందిస్తున్న ఎపిఆర్ఎస్ ఎక్సలెన్స్ పాఠశాలకు రాష్ట్రస్థాయి అవార్డు దక్కింది. ఈ మేరకు గురువారం అమరావతి కేంద్రంగా నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సిఎం నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రెసిడెన్షియల్ ఉత్తమ పాఠశాల విభాగంలో ఏపీ ఆర్ ఎస్ ఎక్సలెన్స్ పాఠశాల ప్రిన్సిపల్ మురళీధర్ బాబు అవార్డును అందుకున్నారు. ఈ పాఠశాల అన్ని విభాగాల్లో ముందంజలో కొనసాగుతూ ఇటు విద్యారంగానూ అటు క్రీడల విభాగంలో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది. ప్రతి ఏడాది పదవ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించడం పరిపాటిగా మారింది.

సిఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపల్

మహిళా సర్పంచికి అరుదైన గౌరవం

పరిగి : మండలంలోని విట్టాపల్లి గ్రామ చేనేత మహిళ, సర్పంచి లక్ష్మమ్మకు అరుదైన గౌరవం దక్కింది. గవర్నర్ రాజ్ భవన్ లో నిర్వహించే ప్రత్యేక విందుకు ఆమెకు ఆహ్వానం అందింది. 78వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విజయవాడలోని రాజ్ భవన్ నందు గవర్నర్ కొందరిని ప్రత్యేక విందుకు ఆహ్వానించారు. ఈ విందులో పాల్గొనేందుకు చేనేత మహిళగా తాను చేసిన సేవలను గుర్తించి ఆహ్వానం పంపడం ఆనందంగా ఉందని సర్పంచి లక్ష్మమ్మ తెలిపారు.

లక్ష్మమ్మ

విద్యార్థులకు ప్రతిభా ప్రోత్సాహకాలు

బత్తలపల్లి : 2023-24 పదో తరగతి ఫలితాల్లో సోషియల్ సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు గురువారం మండలంలోని జడ్పీ హైస్కూల్ సోషియల్ ఉపాధ్యాయులు గంగిరెడ్డి ప్రతిభా ప్రోత్సాహకాలు అందజేశారు. హెచ్ఎం వెంకటనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎస్ఎంసి అధ్యక్ష, ఉపాధ్యక్షులు కుళ్లాయప్ప, సుజాత వందకు వంద మార్కులు సాధించి ట్రిపుల్ ఐటిలో చదువుతున్న బండి ప్రియాంకకు రూ. 5వేల విలువ చేసే మొబైల్ అందజేశారు. మరో 13 మందికి రూ. 1000 చొప్పున నగదు అందజేశారు. గణితం, తెలుగులో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఉపాధ్యాయులు అహ్మద్ జాన్, రవీంద్ర రూ. 1000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ టీచర్లు శ్రీరాములు, అహ్మద్ జాన్, పీడీ లక్ష్మీనారాయణతో పాటు ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోండి : సొసైటీ సీఈవో

అగళి : మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయంలో గతంలో సభ్యత్వం ఉన్న రైతులు తప్పనిసరిగా వెంటనే ఈకేవైసీ (డిజిటలైజేషన్) చేయించుకోవాలని సహకార సంఘం సీఈవో బి.భోజన్న సూచించారు. మండలంలో ఎడిసిసి బ్యాంక్ అనుబంధంగా ఉన్న సంఘాల్లోని సభ్యుల వివరాలు కంప్యూటరైజేషన్ చేస్తున్న సందర్భంగా సంఘంలో సభ్యత్వం లేని ఇంతవరకు ఎలాంటి లావాదేవీలు జరపని సభ్యులు కూడా తమ రికార్డులను డిజిటలైజేషన్ చేయించుకుని పునరుద్ధరించుకోవాలని సూచించారు. వివరాల కోసం సీఈవో భోజన్న 94416 69529, సిబ్బంది నరసింహప్ప 85004 95684 నెంబర్లలో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొత్తచెరువు : కొత్తచెరువు సమీపంలోని పుట్టపర్తి రోడ్డు నాగుల కణం వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. కొత్తచెరువు లోని ప్రభుత్వ ఆసుపత్రి దగ్గర ఉన్న సత్యసాయి వాటర్ సప్లైలో అంజనేయులు పనిచేస్తున్నారు. పుట్టపర్తి లో నివాసం ఉన్న ఆయన మోటార్ సైకిల్‌లో పుట్టపర్తికి వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో తల, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. 108లో చికిత్స నిమిత్తం కొత్తచెరువు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం తరలించారు.

శ్రీచైతన్య ఎటిపి-8లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు

అనంతపురం : అనంతపురం శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఎటిపి-8 బ్రాంచ్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను గురువారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏజిఎం సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఎగురవేశారు. స్వాతంత్ర్య పోరాటం, జాతీయ నాయకుల గురించి అనేక విషయాలను విద్యార్థులకు తెలియజేశారు. ఎందరో వీరుల ప్రాణత్యాగ ఫలితమే దేశ స్వాతంత్ర్యం అన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నేత్రావతి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు, ప్రైమరీ కోఆర్డినేటర్ పూజ, డీన్ అరుణ్ కిరణ్, పిఇటి శివప్రకాష్, దేవకృప, అర్చియా, రషీదా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జెండా వందనం చేస్తున్న ఏజిఎం సుబ్బారెడ్డి

చేనేత పరిశ్రమను ఆదుకోండి

గవర్నర్, సిఎం, డిప్యూటీ సిఎంను కోరిన చేనేత డిజైనర్ నాగరాజు

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

ధర్మవరం పట్టుచీర అంటేనే దేశవ్యాప్తంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని అలాంటి పరిశ్రమను ఆదుకోవాలని చేనేత డిజైనర్ నాగరాజు గవర్నర్, సిఎం, డిప్యూటీ సిఎంను కోరారు. స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా విజయవాడలో గవర్నర్ ఏర్పాటుచేసిన విందుకు ధర్మవరానికి చెందిన చేనేత డిజైనర్ నాగరాజు హాజరయ్యారు. ఈ విందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితిపై డిజైన్ నాగరాజు వారికి వివరించారు. చేనేత పరిశ్రమ పూర్వవైభవానికి కృషి చేయాలని ఆయన సందర్భంగా కోరారు. పవర్ లూమ్స్‌ను తట్టుకొని నిలబడలంటే నేతన్నలకు కూడా రాయితీలు కొన్ని సదుపాయాలు కల్పించాలని ఆయన విన్నవించారు. ప్రధానంగా చేనేతలు తయారు చేస్తున్న అన్ని రకాల వస్త్రాలపై విధిస్తున్న జీఎస్టీ పూర్తిగా తొలగించాలని ఆయన విన్నవించారు. చేనేత కార్మికులకు ప్రస్తుతం ప్రకటించిన విధంగా 200 నుంచి 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తును అందించడంతోపాటు ఎన్ హెచ్ డి సి ద్వారా ముడిసరుకుల రాయితీలు పునరుద్ధరించాలని ఆయన కోరారు అదేవిధంగా హ్యాండ్లూమ్ మెగా క్లస్టర్ ఏర్పాటు చేసి చేనేతలు తయారు చేసే పట్టు చీరలకు పావడాలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు.

చేనేత కార్మికుల సమస్యలను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు వివరిస్తున్న చేనేత డిజైనర్ నాగరాజు